
క్లుప్తంగా

రావి ఆకుపై అర్ధనారీశ్వరుడు



పొదలకూరు : మహాశివరాత్రి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై అర్ధనారీశ్వరుడి చిత్రాన్ని ఆవిష్కరించాడు. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన పెంచలయ్య సందర్భానుసారం వివిధ రకాల చిత్రాలు వేస్తుంటారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి క్లస్టర్ రీసోర్స్ పర్సన్ ఎస్‌కే శివబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వరకవిపూడి రోడ్డు కూడలిలో ఉన్న 60 మంది పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. బ్రహ్మదేవి సర్పంచ్ వి.సుధాకర్, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, మైనార్టీ నేత ఎస్‌కే మస్తాన్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సాయిప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా వీటిని అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోవూరు : జమ్మిపాళెం పరిధిలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎస్.ప్రభాకర్‌రావు శుక్రవారం ఉదయం దాడులు చేసి పట్టుకున్నారు. వీటిని కోవూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. సెబ్ సీఐ నరహరి కథనం మేరకు.. పోతిరెడ్డిపాళెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో గంగవరపు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద తనిఖీ చేయగా 11 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వాటిని సీజ్ చేసి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్సై టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, ఏఎన్‌ఎం రాధా, ఎంఎల్‌హెచ్‌పీలు పద్మజ, సరోజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి



పొదలకూరు : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని సైకాలజిస్ట్ డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో శుక్రవారం నెహ్రూ యువకేంద్రం, సెట్నల్, ఇందూరు ప్రభాకర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై పది విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడాలని, ఇష్టంతో చదవాలన్నారు. యువకేంద్రం కో–ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, సెట్నల్ తహసీల్దార్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ గయాజ్, హెచ్‌ఎం రామకష్ణ, ట్రస్టు వ్యవస్థాపకుడు బి.శీనయ్య పాల్గొన్నారు.

పశు కిసాన్ క్రెడిట్ కార్డులతో మేలు

ముత్తుకూరు : పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులతో ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం నుంచి పశువులకు అవసరమైన ప్రయోజనాలు పొందవచ్చని పశు సంవర్ధక శాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీవీ సురేష్ చెప్పారు. ముత్తుకూరులోని వెటర్నరీ ఏడీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజన్న పశువైద్య సేవలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సంచార పశు వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. 1962 నంబర్‌కు రైతులు ఫోన్ చేస్తే పాడి పశువులు, గొర్రెలకు అవసరమైన వైద్య సేవలు అందజేసేందుకు నేరుగా గ్రామాలకే మొబైల్ వైద్య కేంద్రాలు వస్తాయన్నారు. ఆయన వెంట సహాయ సంచాలకుడు డాక్టర్ నిర్మల సిబ్బంది పాల్గొన్నారు.

మహిమాన్వితుడు.. మనుమ సిద్ధేశ్వరుడు

- మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో కొలువైన కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో మూడు రోజుల పాటు తలపెట్టిన మహాశివరాత్రి వేడుకలు శనివారం ప్రారంభమవుతున్నాయి. సుమారు వేయ్యేళ్ల క్రితం విక్రమ సింహపురిని పాలించిన మనుమసిద్ధి తండ్రి తిరుకాళత్తిదేవుడు ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. మనుమసిద్ధి ఏలుబడిలో మహాకవి తిక్కన సోమయాజి ఈ ఆలయంలో హోమాలు నిర్వహించి, శాసనాలు రూపొందించినట్లు ప్రతీతి.

కృష్ణదేవరాయల కాలంలో కృష్ణపట్నంగా

తొలుత గండగోపాలపట్నంగా పేరుపొందిన ఈ గ్రామం శ్రీకృష్ణదేవరాయల కాలంలో కృష్ణపట్నం గ్రామంగా స్థిరపడింది. గండగోపాలపట్నం రేవుగా పేరుగాంచిన నేటి కృష్ణపట్నం పోర్టు ద్వారా వర్తక వాణిజ్యాలు జరిగినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఈ ఆలయం వెనుక ఉన్న 'దేశ నాయకం' అనే తోటలో 18 దేశాల ప్రతినిధులు సమావేశమై, కృష్ణపట్నం పోర్టు ద్వారా లభించే ఆదాయంలో కొంత భాగం ఆలయ నిర్వహణకు ఖర్చు చేశారని పరిశోధకులు చెబుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లతో పాటు అన్నప్రసాదాలు కూడా సమకూర్చారు. సముద్రతీరంలో ఉన్న ఆలయం పడమర దిక్కు అభిముఖంగా ఉండడం మరో విశేషం.



కృష్ణపట్నం గ్రామంలోని చారిత్రక సిద్ధేశ్వరాలయం

సాగరతీరాన ఆధ్యాత్మిక క్షేత్రం



కాటేపల్లి సముద్రతీరంలోని చంద్రశేఖరస్వామి ఆలయం



సముద్రస్నానాలకు అనుకూలమైన కాటేపల్లి సముద్రతీరం (ఫైల్)

తోటపల్లిగూడూరు : కాటేపల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాక్షిదేవి సమేత చంద్రశేఖర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. కాటేపల్లి సాగరతీరాన కొలువైన ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వేడుకగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. 65 ఏళ్ల కిందట కాటేపల్లి సముద్రం తూర్పుతీరాన బట్టారకం కామయ్య స్వామి ఈ ఆలయాన్ని నిర్మించారు. సముద్రం తీరాన, ఇసుక తిన్నెల మధ్య కొలువైన కాటేపల్లి శివాలయంలోని చంద్రశేఖరుడు భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుస్తూ భక్తుల పాలిటి కల్పతరువుగా విలాసిల్లుతున్నాడు. ఆలయం చెంతనే కాటేపల్లి సముద్ర తీరం ఉండడంతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రాచుర్యాన్ని పొందింది. పండగ రోజు రాత్రి భక్తులు ఆలయలంలో జరిపే జాగరణ, ఉదయం కాటేపల్లి బీచ్‌లో జరిగే పుణ్య స్నానాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

80 మందితో బందోబస్తు

కాటేపల్లి శివరాత్రి ఉత్సవాలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ, పోర్టు సీఐ, ఇద్దరు ఎస్సైలతో 80 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు బందోబస్తు ఉంటుంది. ఈ సందర్భంగా ఎస్సై ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రత్యేక బస్సులు

శివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ–2 డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ తెలిపారు. శని, ఆదివారాల్లో డిపో నుంచి ఐదు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు, ఆత్మకూరు బస్టాండ్ నుంచి పది నిమిషాలకు బస్సులు ఉంటుందని డీఎం తెలిపారు.

అభివృద్ధికి సహకరించండి



ఎంపీ మస్తాన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రసన్న

కోవూరు : నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరు చేసి సహకరించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును కోరారు. నెల్లూరులో శుక్రవారం ఆయన్ను కలిసి అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల మంజూరుకు లిఖితపూర్వకంగా వినతిపత్రం ఇచ్చారు. త్వరలో నిధులు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు ప్రసన్న తెలిపారు.

రామేశ్వరస్వామికి విశేషాభిషేకం



కలశాలను తీసుకొస్తున్న భక్తులు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో కొలువైన మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి విశేషాభిషేకాలు నిర్వహించారు. పెన్నానది నుంచి 108 కలశాలతో తీసుకొచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. పాలేటి శశికుమార్‌శర్మ, కిడాంబి జితేంద్రచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి.

ఓర్వలేకే అసత్య ప్రచారాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

- ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే ప్రసన్న ధ్వజం

కొడవలూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. కొడవలూరు మండలం, నార్తురాజుపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారన్న భయంతోనే పచ్చమీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు పాలనలో జన్మభూమి కమిటీలు జలగల్లా ప్రజలను పీల్చుకుతిన్న విషయాన్ని ఎవరూ మరువలేదన్నారు.

గృహ సారథులు ప్రజల్లోకి వెళ్లాలి

కొత్తగా నియమితులైన గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతో ఉందని, ఆయన్ను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని పరిచయం చేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డీసీఎమ్మెస్, డీఎల్‌డీఏ చైర్మన్‌లు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్, డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ పి.సరోజనమ్మ, ఎంపీపీ జీ.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయ మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ బి.సుప్రియ పాల్గొన్నారు.

లోకేశ్‌ది జనంలేని పాదయాత్ర

బుచ్చిరెడ్డిపాళెం : లోకేశ్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌గా మారిందని, జనం లేక వెలవెలపోతున్న పాదయాత్రగా చరిత్రకెక్కుతుందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎమ్ఎమ్ ఫంక్షన్ హాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శుక్రవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. లోకేశ్ యాత్రకు పక్క రాష్ట్రాల నుంచి జనాలను తరలిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుకుంటున్నట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉన్న పి.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రసన్న కోరారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నల్లపరెడ్డి కుటుంబమంటేనే జనంలో మమేకమై ఉండేవారన్నారు. నల్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ప్రజలకు భరోసా కల్పించేవారని, అదే కోవలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా నడుస్తున్నారన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, కొండూరు మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్లు షాహుల్, లలితా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గృహసారథులతో బాబు గుండెల్లో రైళ్లు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన గృహసారథుల వ్యవస్థతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ప్రారంభమైందని, దీనివల్లే తమ పార్టీ కార్యక్రమాలను కాపీ కొట్టి సాధికార సారథుల వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులో మంత్రి కాకాణి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము 50 ఇళ్లకు ఒక గృహసారథిని నియమించుకుంటే చంద్రబాబు 30 ఇళ్లకు ఒక సాధికార సారథిని నియమించుకుంటామని ప్రకటించాడన్నారు. దీన్నిబట్టి చంద్రబాబు పటిష్టమైన తమ పార్టీ వ్యవస్థను చూసి ఎంతగా భయపడుతున్నాడో అర్థమవుతోందన్నారు. చంద్రబాబు ఎంతసేపు సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ తనకు అపారమైన జ్ఞానం ఉందని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ఊదరకొట్టుకుంటున్నట్లు విమర్శించారు.

అది బుద్ధిహీనుడి పాదయాత్ర

రాష్ట్రంలో ఒక బుద్ధిహీనుడు పాదయాత్ర నిర్వహిస్తూ సీఎంను తిట్టడమే పనిగా పెట్టుకున్నట్లు మంత్రి విమర్శించారు. చంద్రబాబు తనయుడు లోకేశ్‌కు ఏది మాట్లాడాలన్నా నాలుక తిరగడం లేదని, జనం లేక వెలవెలపోతున్న పాదయాత్రను చూసి ప్రజలు నవ్వుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెలుగు పదాలను సక్రమంగా పలకలేని లోకేశ్ పాదయాత్ర కామిడీ షోగా మారిందన్నారు. సభ్యతా సంస్కరం లేకుండా మాట్లాడుతున్న ఆ పిల్లవాడికి చంద్రబాబు ముందు సంస్కారం నేర్పాల్సిందిగా మంత్రి సలహా ఇచ్చారు.

పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజలకు వివరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ద్వారకామయి కల్యాణ మండపంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు అమలు చేయలేని పథకాలను ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును వివరించాల్సిందిగా సూచించారు. మార్చి 20వ తేదీ నుంచి గృహసారథులు రంగంలోకి దిగి పోటాపోటీగా పనిచేయాలని, అందుకు సంబంధించిన సామగ్రిని పార్టీ అందజేస్తుందన్నారు. పొదలకూరు పెద్ద మండలం కావడంతో రెండు విడతలుగా గృహసారథులకు సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో విడతగా ఈనెల 21న విరువూరు లేదా తాటిపర్తి వృద్ధాశ్రమంలో నిర్వహిస్తామన్నారు. సదస్సులో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, వైస్ సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణీ, ఎస్‌కే అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల వల్లే జీవిస్తున్నా..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే తాను ముగ్గురు పిల్లలను పోషిస్తూ జీవిస్తున్నానని ఓ మహిళ తన ఆనందాన్ని పంచుకుంది. పట్టణంలోని నర్సారెడ్డికాలనీకి చెందిన గృహసారథి మహబూబున్నీసా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తన భర్త పనిచేయలేని స్థితిలో ఉన్నాడని, తనకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడని తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.2.50 లక్షల వరకు బ్యాంక్ రుణాన్ని పొందినట్లు చెప్పారు. ప్రభుత్వం పథకాలు చాలావరకు తమ కుటుంబానికి వర్తించాయని, వాటి ద్వారా తాను నిలదొక్కుకున్నట్లు పేర్కొన్నారు. గృహసారథిగా పనిచేయడానికి గర్వపడుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ మోటార్ల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని కాగుల్లపాడు గ్రామ సమీపంలో కోవూరు కాలువ కట్టపై రైతులు ఏర్పాటు చేసుకున్న ఐదు విద్యుత్ మోటార్లు శుక్రవారం అపహరణకు గురయ్యాయి. ఎస్సై వీర ప్రతాప్ కథనం మేరకు.. రైతులు ఎప్పటిలానే తమ పొలాలకు నీరు పెట్టేందుకు శుక్రవారం ఉదయం వెళ్లగా కాలువ కట్టపై మోటార్లు లేవు. దీంతో చోరీ జరిగిందని రైతులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

పాఠశాలల పరిశీలన

కొడవలూరు : మండలంలోని గుండాలమ్మపాళెం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జి.వసంతకుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. నోట్ పుస్తకాలు పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి సంతృప్తి చెందారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం ఎం.లత ఉన్నారు.

మృతుడు మనుబోలు వాసి



మహేష్ (ఫైల్)

మనుబోలు : మండల పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా చనిపోయిన వ్యక్తి మనుబోలులోని కోదండరామపురానికి చెందిన కంద్రాతి మహేష్(40)గా శుక్రవారం గుర్తించారు. పశువుల సంతలో మహేష్ క్రయవిక్రయాలు సాగించేవాడు. రైల్వేట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు జరిగిందా, ఆత్మహత్యకు పాల్పడ్డా అనేది తెలియరాలేదు. కాగా మహేష్‌కు భార్య సంపూర్ణమ్మ, కుమారులు సాత్విక్, శ్రీలోక్, త్రినాథ్ ఉన్నారు.

చెడు వ్యసనాలతో ప్రాణాలకు ముప్పు

ఇందుకూరుపేట : చెడు వ్యసనాలతో ప్రాణాలకు ముప్పు తప్పదని, యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సెబ్ సీఐ బాలకృష్ణ కోరారు. మండలంలోని ఇందుకూరుపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని వివేకానంద్ పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల వారు గ్రామస్తులకు వివరించారు. కౌన్సిలర్లు మోర్ల జయంతి, ప్రమీలమ్మ, పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం శిలాఫలకాలకే పరిమితం

- ప్రస్తుతం చేతల్లో అభివృద్ధి
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : గత టీడీపీ ప్రభుత్వం శిలాఫలకాలకే పరిమితమైతే, తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని చేతల్లో చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి శుక్రవారం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. తొలుత సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శిలాఫలకాలు తప్ప ఒక్క పనిని పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. ఇందుకు భిన్నంగా తమ ప్రభుత్వం తలపెట్టిన ప్రతి పనిని పూర్తి చేస్తున్నట్లు వివరించారు. గతంలో వికలాంగుల పెన్షన్ విషయంలో ఒక ఇంట్లో రెండో పెన్షన్ ఇవ్వాలన్నా, పూర్తి పింఛన్ ఇవ్వాలన్నా 80 శాతం వైకల్యం ఉండాలని ఉత్తర్వులు తెచ్చారని, దీనిని ఆసరాగా తీసుకుని పూర్తి వైకల్యం ఉన్నవారికి కూడా అధికారులు 79 శాతం వేశారని తెలిపారు. పొక్కుంటూ వచ్చిన ఓ మహిళను తాను ఎంత పింఛన్ వస్తుందని అడగ్గా రూ.1000 వస్తుందని తెలిపిందన్నారు. ఈ విషయమై తాను అధికారులను ప్రశ్నించగా 80 శాతం వేస్తే తమ ఉద్యోగాలు పోతాయని, అందుకే 79 శాతం వేశామని తెలిపారన్నారు. ప్రస్తుత తమ ప్రభుత్వం ఎటువంటి గ్రేడింగ్ లేకుండా ప్రతి దివ్యాంగునికి రూ.3000 పింఛన్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఏఈలు కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నేతలు కొండూరు జనార్దన్ రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, శేషురెడ్డి, మహేంద్రవర్మ, రమేష్ పాల్గొన్నారు.

వేడుకగా రావణ సేవ



బుచ్చిరెడ్డిపాళెం : హంసవాహనంపై వెంకటేశ్వరస్వామి



కొడవలూరు : స్వామివార్లకు చప్పర ఉత్సవం

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకోళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రావణ సేవను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివార్లకు చప్పర ఉత్సవం వైభవంగా చేశారు.

హంస వాహనంపై వెంకటేశ్వరస్వామి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు శుక్రవారం రాత్రి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఇనుగూరు సుబ్బారావు–ధనలక్ష్మి, తన్నీరు లక్ష్మీప్రసాద్‌రావు–రూపకళ, గాదంశెట్టి సుబ్రహ్మణ్యం–భాగ్యలక్ష్మి, గాదంశెట్టి రమేష్–వరలక్ష్మిలు వ్యవహరించారు.



బుచ్చిరెడ్డిపాళెం : రావణసేవలో గ్రామోత్సవం

- ఇస్కపాళెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ, ఈశ్వరి దేవి మఠంలో ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి శుక్రవారం రావణసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా పెనబల్లి మనోజ్‌సిద్ధారెడ్డి, హేమలతారెడ్డి, కె.శివప్రద్యుమ్నాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు.

బైక్ ఢీకొని బాలికకు గాయాలు

వెంకటాచలం : రోడ్డు దాటుతున్న బాలికను మోటారు బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలిక గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన మండలంలోని ఇస్కపాళెంలో గురువారం సాయంత్రం జరగ్గా, శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇస్కపాళెం గ్రామానికి చెందిన పరిణిక అనే బాలిక తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని మోటారు బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరిణికకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం స్థానికులు నెల్లూరుకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.